సాక్షి
వికారాబాద్
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



జంట హత్యలా?

తల్లీకుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మంగళవారం కాశీంపూర్‌లో కలకలం రేపింది. 10లో▸



ఉల్లి రైతుల్లో జోష్

ఉల్లి పంటకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 10లో▸




ప్రతి కూలీకి ఉపాధి

వేసవి కాలం దృష్ట్యా ఏప్రిల్ నుంచి జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీకి ఉపాధి కల్పిస్తామని డీఆర్‌డీఏ శ్రీనివాస్ పేర్కొన్నారు. 11లో▸

దళారులదే హవా!

మార్కెట్లలో వీరు వేసిందే తూకం.. నిర్ణయించిందే ధర

- పాలకవర్గం, అధికారులతో కుమ్మక్కు
- మార్కెట్‌కు సమాంతరంగా సిండికేట్ దందా
- మద్దతు ధరకంటే తక్కువకే కొనుగోలు
- దోపిడీకి గురవుతున్న రైతులు



వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

వికారాబాద్: వ్యాపారులు వేసిందే తూకం.. దళారులు చెప్పిందే ధర అన్న చందంగా మార్కెట్ వ్యవస్థ తయారైంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో వేరు శనగ, కంది పంట అమ్మకానికి వచ్చాయి. దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు పంటలు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో మార్కెట్‌లో ఒక్కరిద్దరు గుత్తాధిపత్యం చేస్తూ ఇతర వ్యాపారులను రానివ్వడం లేదు. దళారులను అరికట్టేందుకు ఈ-మార్కెట్ విధానం తీసుకువచ్చినా ఆన్‌లైన్ కొనుగోళ్ల మచ్చుకైనా కనబడడం లేదు. మార్కెట్లలో పాతుకుపోయిన ఒకరిద్దరు వ్యాపారులు ధర నిర్ణయించి రైతు ఆదాయానికి గండి కొడుతున్నారు. తాము నష్టపోతున్నామని రోడ్డెక్కుతున్నా.. ఫిర్యాదులు చేస్తున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లైసెన్స్ లేకుండా కొనుగోళ్లు

జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో సాగు చేసిన పంట చేతికి వచ్చింది. మూడు వారాలుగా రైతులు పరిగి, కొడంగల్, ధారూరు, మర్పల్లి, తాండూరు, బషీరాబాద్, కుల్కచర్ల తదితర మార్కెట్‌లకు తీసుకువస్తుండడంతో లైసెన్స్ లేని చిల్లర వ్యాపారస్తులు అక్కడ వాలిపోయారు. పేరుకు మాత్రమే చిల్లర వ్యాపారులు వారు చేసే దందా మాత్రం మార్కెట్‌కు సమాంతరంగా ఉంటోంది. తూకాల్లో కనికట్టు ప్రదర్శిస్తూ ప్రతీ వారం వేల క్వింటాళ్లలో పంట కొనుగోలు చేస్తూ రైతులకు టోపీ పెడుతున్నారు. రూ.కోట్లలో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

సిండికేట్ దందా

వ్యవసాయ మార్కెట్‌లలో కొనుగోలుదారులందరూ సిండికేట్ దందా నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు మాత్రం స్పందించడం లేదు. గతంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపారే తప్పా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు సైతం అడ్తిదారులకు, కొనుగోలు దారులకు కొమ్ము కాస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గత శుక్ర, శనివారాల్లో పరిగిలో నిర్వహించిన అడ్తీల్లో ఒక్క రోజులోనే వేరు శనగ పంట ధరలు రూ.వేయికి పైగా తగ్గించారు. ప్రస్తుతం కంది, వేరు శనగ పంట మార్కెట్లోకి రాగా ఈ రెండు పంటలు కూడా మద్దతు ధర కంటే రూ.వేయి కంటే తక్కువే అమ్ముడవుతున్నాయి. కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహకుల కొర్రీలతో మెజార్టీ రైతులు వ్యవసాయ మార్కెట్లలోనే విక్రయిస్తున్నారు. మరో వైపు రాత్రిళ్లు తూకాలు వేస్తూ మాయ చేస్తున్నారు.



లగచర్ల రైతులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పది పరీక్షలు సజావుగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పదోతరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. మార్చి 21 నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు 6,450 మంది బాలురు, 6,453 మంది బాలికలు, మొత్తం 12,903 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఇందుకు 69 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు విద్యార్థులు గంట ముందుగానే సెంటర్ చేరుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఎలక్ట్రికల్ వస్తువులు, సెల్ ఫోన్లు తీసుకురాకూడదని సూచించారు. పరీక్ష కేంద్రంలో పరిసరాల్లో సెల్‌ఫోన్‌లు పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాలలో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఈఓ రేణుకాదేవి, ఏసీజీఈ రాంరెడ్డి, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

లగచర్ల రైతులకు చెక్కులు

కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవుతున్న రైతులు అభినందనీయులని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. పారిశ్రామిక వాడలో భూములు కోల్పోతున్న లగచర్ల సర్వే 102లోని 22 మంది రైతులకు మంగళవారం పరిహారం చెక్కులు అందజేశారు. 31.35 ఎకరాలకు గాను రూ.6.38 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. మీ త్యాగల ఫలితంగా ఏర్పడుతున్న పారిశ్రామిక వాడతో నియోజకవర్గ అభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. పరిహారం చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఓవీటీ శారద, అసిస్టెంట్ జోన్ మేనేజర్ అజీమా సుల్తానా, దుద్యాల తహసీల్దార్ కిషన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'డబుల్' ఇళ్లను పంపిణీ చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



వికారాబాద్‌లో నిలిచిన డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి/ధారూరు: మండల కేంద్రంలోని ఈద్గా సమీపంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు, తండాల్లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేసే సాయం రూ.10లక్షలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సతీశ్, నవీన్, యాదయ్య, సుదన్యన్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా గోపాల్ ముదిరాజ్



నూతన కమిటీ సభ్యులతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

అనంతగిరి: బీఆర్‌ఎస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ గోపాల్ ముదిరాజ్ నియమితులయ్యారు. మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నూతన కమిటీని నియమించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుభాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్‌ను నియమించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు చెప్పారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, రమేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, లక్ష్మణ్, రాములు, బీఆర్ శేఖర్, పాండు, రాజేందర్, దేవదాసు, అశోక్, రమణ, అనంతయ్య, మల్లేశం, సురేశ్, ముర్తుజా అలీ, గిరీశ్, కొఠారి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

అనంతగిరి: మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 29 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16,439 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు 'పునాది'



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆరుగ్యారంటీల పథకాల అమలులో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నాగిరెడ్డిపల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామం నుంచి 210 దరఖాస్తులు రాగా.. 101 మందిని అర్హులుగా గుర్తించారు. రాజకీయాలకు ప్రాధాన్యతనివ్వకుండా గ్రామం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గ్రామస్తులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ మల్లేశం, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్, నాయకులు నర్సింలునాయుడు, కిష్టప్ప, గ్రామాధ్యక్షుడు నర్సింలు, చందర్, తదితరులున్నారు.



తాండూరు టౌన్: తాండూరు రైల్వే స్టేషన్‌లో ఎస్‌సీఆర్ జీఎం అరుణ్ కుమార్ జైన్

ఆధునికీకరణ పనులపై ఆరా

- వికారాబాద్ స్టేషన్‌ను సందర్శించిన రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- ఆర్‌యూబీల నిర్మాణానికి వినతులు



అనంతగిరి: రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

అనంతగిరి: రైల్వే సేవలను మెరుగుపరిచేందుకు చొరవ తీసుకుంటున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. మంగళవారం ఆయన ఆయా విభాగాల అధికారులతో కలిసి వికారాబాద్‌రైల్వేషన్‌ను పరిశీలించారు. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్లలో చేపట్టిన ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టిన పనులు, ఇంకా జరగాల్సిన పనులను ఆయనకు వివరించారు. జనరల్ వెయిటింగ్ హాల్, సీటింగ్, ఏసీ హాల్, టికెట్ కౌంటర్, లోకో పైలెట్ గదిని పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధి నమూనా పరిశీలించారు. అనంతరం స్టేషన్ మాస్టర్ గదిలో సిగ్నలింగ్ ప్యానల్ వ్యవస్థను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎం భరత్‌కుమార్, సీనియర్ డీఎస్‌సీ డెబాస్మిత్ ఛటర్జీ, సీనియర్ డీఏస్‌టీఈ సుప్రియ, పీసీఓఎం పద్మజ, ఆయా విభాగాల ముఖ్య అధికారులు, డివిజనల్ అధికారులు, వికారాబాద్ స్టేషన్ మేనేజర్ దేవేందర్, ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన కాలె యాదయ్య

వికారాబాద్ పర్యటనకు విచ్చేసిన రైల్వే జీఎంకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలను ఆయనకు వివరించారు. తన నియోజకవర్గ పరిధిలోని నవాబ్‌పేట మండల పరిధి చిట్టిగడ్డ-చించల్‌పేట మధ్య, ముబారక్‌పూర్-పర్వేద మధ్య, స్టేషన్‌గొల్లగూడస్టేషన్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని కోరారు. చిట్టిగడ్డ రైల్వే స్టేషన్‌లో అన్ని ప్యాసింజర్లు, ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లను ఆపాలన్నారు. కరోనా ముందు నిలిపేవారని కరోనా అనంతరం నిలపడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శంకర్‌పల్లి పట్టణంలో అన్ని రైళ్లను ఆపాలని దీంతో వేలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పలువురు నాయకులతో జీఎంను కలిసి సమస్యలు విన్నవించారు. జిల్లా కేంద్రం అయినందున రాజ్‌కోట్, కోణార్క్ రైళ్లను ఆపాలన్నారు. రామయ్యగూడ రోడ్, అనంతగిరి రోడ్‌లో గల రైలు మార్గాల వద్ద ఆర్‌ఓబీలు నిర్మించాలన్నారు. ధారూర్ మండల కేంద్రంలో అన్ని రైళ్లను ఆపాలన్నారు. చాలా రైళ్లు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎంఎంటీఎస్‌ను వికారాబాద్ వరకు పొడిగించాలన్నారు. ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

తాండూరు టౌన్: రైలు ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకే ప్రాధాన్యత ఇస్తామని ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. మంగళవారం ఆయన తాండూరు రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రన్నింగ్ రూం, వెయిటింగ్ హాల్, ఎలివేటర్, లిఫ్ట్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్ ఫాం పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. తాండూరు రైల్వే స్టేషన్ సుందరీకరణకు రూ.24 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

తాండూరు నుంచి రైళ్లు నడపండి

తాండూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రైలు సర్వీసులు లేవని.. ఇంటర్ సి టీ ఎక్స్‌ప్రెస్ రైలును పునరుద్ధరించాలని మార్వాడీ యువమంచ్, రైలు ప్రయాణికుల అసోసియేషన్ సభ్యులు ఎస్‌సీఆర్ జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను కోరారు. రేపల్లె, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను తాండూరు వరకు పొడిగించాలన్నారు. జీఎం వెంట ఎస్‌సీఆర్ సికింద్రాబాద్ డివిజన్ రైల్వే అధికారులు తదితరులు ఉన్నారు.

వైద్యారోగ్య కార్యక్రమాలు విస్తృతం

- రాష్ట్ర వైద్యారోగ్య అదనపు సంచాలకులు డాక్టర్ పుష్ప
- పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ

అనంతగిరి: వైద్యారోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య అదనపు సంచాలకులు డాక్టర్ పుష్ప అన్నారు. మంగళవారం రాష్ట్ర బృందం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట ప్రకారం జిల్లాలోని రిజిస్టర్డ్ ప్రైవేట్ ఆస్పత్రులపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలోని పలు ఆస్పత్రులను పరిశీలించారు. పేషెంట్, వారి అటెండెంట్‌లకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు, బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ విధానం, ఫైర్ సేఫ్టీ, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలు, అందించే సేవల వివరాలు, వివిధ సేవలకు వసూలు చేసే రుసుము వివరాలు, అందుబాటులో ఉన్న పడకలు, ఎమెర్జెన్సీ, ఆక్సిజన్, ల్యాబ్, బ్లడ్ బ్యాంక్, అంబులెన్స్ సౌకర్యాలపై తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలు పర్యవేక్షణ బృందం సునీల్ రాజ్, అనిల్, నిరంజన్‌రావు, వెంకట్‌రాంరెడ్డి, రమావాణి పాల్గొన్నారు.



వికారాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని పరిశీలిస్తున్న క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలు పర్యవేక్షణ బృందం

9999 నంబర్‌కు రూ.4,55,450

అనంతగిరి: జిల్లాలోని పరిగి యూనిట్ కార్యాలయంలో ఓ ఫ్యాన్సీ నంబర్‌కు ఆన్‌లైన్‌లో వేలం వేయగా గిరిజాపురం మాధవరెడ్డి భారీ ధర చెల్లించి దక్కించుకున్నట్లు జిల్లా రవాణా అధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన సిరీస్ ప్రారంభంకావడం పరిగి యూనిట్ కార్యాలయానికి కాసుల వర్షం కురిసింది. 9999 నంబర్ కోసం మాధవరెడ్డి రూ.4,55,450 వెచ్చించారని చెప్పారు.

క్లుప్తంగా

కుల్కచర్లలో చికెన్ మేళా



ఉచితంగా చికెన్, గుడ్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కుల్కచర్ల: బర్డ్ ఫ్లూ వ్యాపిస్తుందంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో మంగళవారం కుల్కచర్లలో శ్రీ భవాని చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చికెన్‌ను 70 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఉడికించి తినవచ్చని, ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. చికెన్ తినడం వల్ల ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తవని, నిర్ధారించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వెన్‌కాబ్ చికెన్ కంపెనీ ఆధ్వర్యంలో చికెన్ మేళాను నిర్వహించి 2 క్వింటాళ్ల చికెన్ పకొడిని, 2వేల గుడ్లను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లంబాడహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, నిర్వాహకులు బాలాజీ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

మొయినాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండ్‌తో పార్టీ నిర్వహిస్తున్న ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. మొయినాబాద్‌లోని జెబెల్ అర్చేడ్ ఫాంహౌస్‌లో మంగళవారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్ పెట్టి పార్టీ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీ నిర్వహిస్తున్న వారితోపాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ అపహరణ

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగుడు స్కూటీని అపహరించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గరిగే రవీందర్‌గౌడ్ తన స్కూటీని సంతోష్ థియేటర్ వద్ద నిలిపి వెళ్లాడు. తాళం వదిలి వెళ్లడంతో దుండుగుడు స్కూటీని అపహరించుకొని వెళ్లిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు

ఉమెన్స్ డే రోజు 'రన్ ఫర్ యాక్షన్-2025'

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మార్చి 8న నగర షీ-టీమ్స్ 'రన్ ఫర్ యాక్షన్-2025'పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. పీవీ మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగే ఈ 5కే, 2కే పరుగుకు సంబంధించిన పోస్టర్‌ను కొత్వాల్ సీవీ ఆనంద్ మంగళవారం ఆవిష్కరించారు. వీటిలో పాల్గొనాలని భావిం చేవారు (https://rfa.bebetter.run) వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మహిళా భద్రత విభాగం డీసీపీ లావణ్య తెలిపారు. 'మహిళల భద్రతకు అవసరమైన చర్యలు వేగవంతం చేయండి'అనే థీమ్‌తో ఈ రన్ నిర్వహిస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హసన్‌నగర్‌లోని మదీనా మసీదు సమీపంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు.

రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్: మహా శివరాత్రిని పురస్కరించుకొని మండల పరిధిలోని రామేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయంలో జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బుధ, గురువారాల్లో షాద్‌నగర్ నుంచి 12 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికీ రానుపోను చార్జీలు రూ.60 వసూలు చేయనున్నట్లు తెలిపారు. రామేశ్వరంలోని దేవాలయానికి వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ఉల్లి రైతుల్లో జోష్



ఎన్కేపల్లిలో రెయిన్ డ్రిప్ ద్వారా సాగు చేస్తున్న ఉల్లి

ఆరోగ్యానికి ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని నానుడి. అంతటి ప్రాధాన్యం ఉన్న పంటను సాగు చేసే రైతులు కొంత కాలంగా తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. ఆశించిన స్థాయిలో ధర లేకపోవడం, పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షంతో మొత్తం తుడిచి పెట్టుకుపోయింది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లికి మంచి ధర పలుకుతుండడంతో అన్నదాతల సంతోషానికి అవదుల్లేకుండా పోయాయి.

- మార్కెట్‌లో ఆశాజనకంగా ధరలు
- క్వింటాలుకు రూ.1,800లకు పైమాటే
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మోమిన్‌పేట: ఉల్లి పంటకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అన్నదాతలు ధరలు లేక పూర్తిగా నష్ట పోవాల్సి వచ్చింది. వడగండ్ల వర్షం కురవడంతో పంట ఆనవాళ్లు లేకుండా పోయింది. దీంతో ఆరుగాలం చలి, ఎండకు శ్రమించిన కర్షకులు బోరున విలపించారు. ప్రస్తుతం మాత్రం అలాంటి పరిస్థితి లేదు. ఉల్లికి మంచి ధర పలుకుతుండటంతో రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.2,000 వరకు ఉల్లిని విక్రయిస్తున్నారు. పెట్టుబడులు పోనూ ఆశాజనకంగానే లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

సాంకేతిక పద్ధతిలో నారు

మండల పరిధిలోని ఏన్కతల, కాస్లబాదు, రాళ్లగుడుపల్లి, మేకవనంపల్లి, చక్రంపల్లి, కోల్కుంద, అంరాధికలాన్, అంరాధికుర్దు, ఎన్కేపల్లి గ్రామాలలో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. సుమారుగా 800 నుంచి 1000 ఎకరాల వరకు రబీలో ఉల్లిని సాగు చేశారు. గతంలో రైతులు ఉల్లి నారును చిన్న చిన్న ఎత్తైన మడులలో తయారు చేసుకునే వారు. వాటిలో తెగులు వచ్చిన నారు మడులు కుళ్లిపోయేవి. కానీ ప్రస్తుతం నూతన సాంకేతికతను ఉపయోగించి రెయిన్ డ్రిప్ ద్వారా నారు మడులను తయారు చేస్తున్నారు. దీంతో తెగులు రాకుండా అరికట్ట వచ్చని రైతులు పేర్కొంటున్నారు. నారు కోన తెల్ల బారిన పడితే వెంటనే రెయిన్ డ్రిప్ ద్వారా నీటిని వదలడంతో నారు మొత్తం తడిచి ఎదిగేందుకు ఎక్కువ అవకాశం ఉంది. అదే విధంగా నాటే సమయంలో కూడా రెయిన్ డ్రిప్ ద్వారానే సాగు చేస్తున్నారు. తడులు ఇచ్చేందుకు కూలీల ఖర్చు తక్కువతో పాటు నీటిని పొదుపుగా వాడుకోవచ్చని రైతులు అంటున్నారు. దిగుబడులు సైతం అధికంగా వస్తున్నాయని చెబుతున్నారు. ఎకరాకు 100 క్వింటాళ్ల పైగానే దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాలో సాగు



ప్రస్తుతం ఎకరాలో ఉల్లిని సాగు చేశా. రెండేళ్ల క్రితం రెండు ఎకరాలలో సాగు చేయగా పంట తీతకు వచ్చిన సమయంలో వడగండ్ల వర్షం కురిసి పూర్తిగా కుళ్లిపోయింది. దీంతో పొలంలోనే దున్ని వేశా. అదే భయంతో ఎకరాలోనే సాగు చేశా. మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. దిగుబడులు సైతం ఆశించిన స్థాయిలో వస్తుందని భావిస్తున్నా.

– రాంచంద్రారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

కూలీల ఖర్చు ఎక్కువ



ఎకరంన్నరలో ఉల్లిని సాగు చేశా. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ఇంకో నెలలో కోతకు వస్తుంది. మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ఇదే ధర కొనసాగితే పెట్టుబడులు పోనూ లాభాలు వస్తాయి. నాటు వేసేటప్పుడు కూలీల ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. వాటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం.

– నర్సింలు, రైతు, ఎన్కేపల్లి

ప్రశాంత జీవనంలో 'మంటలు'

- గ్యాస్ లీకైన ఘటనలో గాయాలపాలైన బాధితులు
- పని చేయలేని స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



కాలిన గాయాలతో బాధితులు

కుల్కచర్ల: ఉన్నంతలో హాయిగా జీవిస్తున్న ఆ కుంటుంబం ఊహించని ప్రమాదంలో చిక్కుకుంది. వంట చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ కావడం, మంటలు అంటుకుని గాయాలపాలవడంతో వీరి జీవితాలు తలకిందులయ్యాయి. రెక్కల కష్టం చేసుకుని బతికే బాధితులు ప్రస్తుతం ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలోని గోరిగడ్డ తండాకు చెందిన వడిత్య పాండు, దేవమ్మ దంపతులకు కుమార్తె సునీత, కొడుకు గణేశ్ సంతానం. ఈనెల 8న ఉదయం పాండు ఇంట్లో వంట చేస్తుండగా.. భార్యాపిల్లలు బయట ఉన్న నల్లా నుంచి నీళ్లు తెస్తున్నారు. అంతలోనే గ్యాస్ సిలిండర్ పైప్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నలుగురూ ప్రమాదంలో చిక్కుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తాత్కాలికంగా ఉపశమనం పొందిన వీరు పూర్తిగా కోలుకోలేదు. పాండు, దేవమ్మ, గణేశ్ కదలలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తే మామూలు స్థితికి రావొచ్చని డాక్టర్లు చెబుతున్నారు. దాతలు కనికరిస్తే వైద్యం చేయించుకుంటామని బాధితులు దీనంగా ఎదురుచూస్తున్నారు.

సౌత్ ఫ్లోరిడా వర్సిటీతో ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న కళాశాల ప్రతినిధులు

మొయినాబాద్: స్థానిక ము న్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీతో బిజినెస్ అవగాహన ఒప్ప ందం కుదుర్చుకుంది. మంగళవారం కేజీరెడ్డి కళాశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి, సౌత్ ఫ్లోరిడా ముమా కళాశాల ప్రతినిధి భువన్ పుల్‌హెల్కర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఒప్పందం వల్ల బోధన సలహాలు, సూచనలతో పాటు మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు, నైపుణ్య శిక్షణకు పరస్పర సహకారానికి ఒప్పందం దోహదపడుతుందన్నారు.

అప్పు చెల్లించడం లేదని..

బైక్ లాక్కెళ్లిన పీఏసీఎస్ అధికారులు

యాచారం: అప్పు చెల్లించడం లేదని యాచారం పీఏసీఎస్ అధికారులు ఓ మహిళ రైతు కుటుంబానికి చెందిన బైకును మంగళవారం లాక్కెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గడ్డ మల్లయ్యగూడ గ్రామానికి చెందిన ఇక్క మల్లమ్మకు నక్కర్తమేడిపల్లి గ్రామంలోని సర్వే నంబరు 95లో మూడు ఎకరాల పట్టా భూమి ఉంది. దానిపై 2016లో యాచారం పీఏసీఎస్‌లో మార్టిగేట్ చేసి రూ.4,28,400 అప్పును తీసుకుంది. ప్రస్తుతం అది అసలు, వడ్డీతో కలిపి రూ.6 లక్షలు దాటింది. గత సర్కార్ హయాంలో సదరు భూమిని ఫార్మాసిటీకి తీసుకున్నారు. అందుకుగానూ రూ.12.50 లక్షల పరిహారాన్ని పొందారు. తీసుకున్న అప్పును చెల్లించాలని పలుమార్లు యాచారం పీఏసీఎస్ అధికారులు లీగల్ నోటీసులు పంపారు. దీనికి మల్లమ్మ స్పందించకపోవడంతో మంగళవారం పీఏసీఎస్ సీఈఓ నాగరాజు, యాచారం డీసీసీబీ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మీలు గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమె కుమారుడి పర్వతాలుకు చెందిన బైక్‌ను యాచారంలోని పీఏసీఎస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. రూ.లక్ష విలువ చేసే బైక్‌ను తీసుకెళ్లితే మొత్తం అప్పు తీరుతుందా.. అని ఆ మహిళ రైతు ప్రాధేయపడినా అధికారులు ససేమిరా అన్నారు. వచ్చే నెల 30 లోపు మొత్తం అప్పు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు.

గ్రామాల వారీగా పహాణీల స్కాన్



మాట్లాడుతున్న కలెక్టర్

- తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పహాణీ స్కానింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరమ్మతులు, ఉపాధి హామీ పథకం అమలు, వసతి గృహాల తనిఖీ, ధరణి అంశాలపై మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో 2000–2015 మధ్య ఉన్న ప్రతీ పహాణీని గ్రామాల వారీగా స్కాన్ చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. తాగునీరు, బియ్యం, కూరగాయల నాణ్యత తప్పక పరిశీలించాలన్నారు. హాస్టల్‌ల అన్నింటికి ఒకే విధమైన రంగులు వేయించాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేపట్టే మరమ్మతు పనులు నాణ్యత పాటించాని సూచించారు. లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్య పనులపై ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు పోలీస్ స్టేషన్లను గుర్తించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లు జరిగిన విధులు నిర్వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.శంకర్ నాయక్, డీఈఓ రేణుకాదేవి, డీఆర్డీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొలం వద్ద నిద్రిస్తున్న రైతుపై దాడి



మేడిపల్లిలో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డి

మాస్కులు ధరించి కత్తులతో బెదిరింపు

మొయినాబాద్: వ్యవసాయ పొలం వద్ద భార్య, కొడుకుతో కలిసి నిద్రిస్తున్న రైతుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో సోమవారం రాత్రి చోటుకేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన ధన్‌రాజ్ అతని భార్య సరిత, కొడుకు జగదీష్ సోమవారం రాత్రి 10 గంటల వరకు వ్యవసాయ పొలం వద్ద పనిచేశారు. పని ముగించుకుని అక్కడే నిద్రపోయారు. ముఖాలకు మాస్కులు పెట్టుకున్న ఇద్దరు దుండగులు అటువైపు రావడంతో సరిత ఎవరని ప్రశ్నించింది. చప్పుడు చేస్తే చంపేస్తామని దుండగులు బెదిరించారు. వెంటనే ఆమె భర్తను నిద్రలేపడంతో దుండగులు పారిపోయారు. కొద్దిసేపటి తరువాత మరో ఇద్దరు దుండగులను తీసుకుని మొత్తం నలుగురు కత్తులు, పైపులు తీసుకుని వచ్చి ధన్‌రాజ్‌పై దాడి చేశారు. గొంతు, చెవి కోసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ధన్‌రాజ్‌ను చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల చోరీ

మేడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన కె.రాజు, కొత్తపల్లి నరేందర్, ఎస్.అంతయ్య, పొద్దటూరి మల్లేష్ పొలాల వద్ద దుండుగులు బోరు మోటార్ల నుంచి కేబుల్ కట్ చేసుకువెళ్లారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కేబుల్ వైర్ల చోరీకి వచ్చిన దుండగులే ధన్‌రాజ్‌పై దాడి చేసి ఉండవచ్చని గ్రామస్తులు, పోలీసులు అనుమానిస్తున్నారు. నెల రోజులుగా వ్యవసాయ బోర్ల వద్ద తరచూ కేబుల్ వైర్ల చోరీ జరుగుతుందని గ్రామస్తులు వాపోయారు.

ఊరికి వెళ్తానని.. మేస్త్రీ అదృశ్యం

యాచారం: తన తల్లికి ఆరోగ్యం బాలేదని ఊరెళ్లిన వ్యక్తి ఇంటికి చేరుకోని ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వేసుపోగు ఏసురత్నం రెండు నెలల కిందట భవన నిర్మాణ పనుల్లో మేస్త్రీ పని చేయడానికి మండలంలోని తాడిపర్తి గ్రామానికి వచ్చి బంధువుల వద్ద ఉంటున్నాడు. ఈ నెల 8న తన తల్లికి బాగోలేదని స్వగ్రామానికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. అటు స్వగ్రామానికి వెళ్లకపోవడం, ఇటు తాడిపర్తికి రాకపోవడంతో మంగళవారం ఆయన బంధువులు గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712662726కు సమాచారం అందించాలని కోరారు.

భూకైలాస్‌లో భద్రత కట్టుదిట్టం

- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- నేడు మహారాష్ట్ర నుంచి మంత్రి రాక



ఆలయ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండా భూకైలాస్‌లో ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలసంఖ్యలో తరలి రానున్నారు. బుధవారం మహారాష్ట్ర నుంచి క్యాబినెట్ మంత్రి సంజయ్ రాథోడ్ హాజరవుతున్నారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి హెలిపాడ్‌లో భూకైలాస్‌కు చేరుకుంటారు. నీటి గుండా స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా హెలిపాడ్ ప్రదేశాన్ని మంగళవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. సిబ్బందితో పటిష్ట భద్రతను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఆలయ వ్యవస్థాపకులు శంకర్ నాయక్‌పవార్, వాసు నాయక్‌పవార్ పాల్గొన్నారు.

అక్రమ పోస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

సర్వీస్ అసోసియేషన్ ఫర్ విజనరీ టీచర్స్ అసోసియేషన్

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా విద్యాశాఖలో స్పౌజ్ పేరుతో భారీగా అక్రమాలు జరిగాయని, కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సర్వీస్ అసోసియేషన్ ఫర్ విజనరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల మధుకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శి సురేశ్‌లు సంయుక్తంగా ఓ ప్రకటనలో ఆరోపించారు. జీవో 317 కేబినెట్ సబ్‌కమిటీ సిఫార్సుల ప్రకారం భారీ అవకతవకలు జరిగాయన్నారు. తలకొండపల్లి మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పడకల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషుగా పని చేస్తున్న వారి స్పౌజ్ స్కూల్ అసిస్టెంట్ నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కౌన్సెలింగ్ ద్వారా అదే మండలంలోని జెడ్పీహెచ్ ఖానాపూర్ పాఠశాలకు మొదటగా కేటాయిస్తే విధుల్లో చేరలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్యాయం చేసి 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ప్రాంతం సరూర్‌నగర్ మండలంలోని రాజీవ్‌గాంధీ పాఠశాలకు కేటాయిస్తూ 20 రోజుల తర్వాత మోడిఫికేషన్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జెడ్పీహెచ్‌ఎస్ తొర్రూర్ ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులు లేకున్నా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు, సోషల్ స్పౌజ్ పోస్టులు నింపడం ఎలా సాధ్యమైందన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి, అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యలా.. జంట హత్యలా?

తల్లీకుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మంగళవారం బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో కలకలం రేపింది. ఇవి ఆత్మహత్యలా..? జంట హత్యలా..? తేలాలంటే పోస్టుమార్టం నివేదిక రావాల్సిందే. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

కాశీంపూర్‌లో తల్లీకొడుకుల అనుమానాస్పద మృతి



మృతుల ఇంటి ఎదుట గుమిగూడిన గ్రామస్తులు

బషీరాబాద్: కాశీంపూర్‌కు చెందిన మాల మొగులప్ప(35), రేణుక దంపతులకు కొడుకు, కుమార్తె సంతానం. తల్లి మాల ఎల్లమ్మ(60)తో కలిసి అందరూ ఒకే చోట నివసిస్తున్నారు. మొగులప్ప గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వారం క్రితం ఆయనకు రూ.18 వేలు జీతం రావడంతో డబ్బులు ఇవ్వాలని రేణుక గొడవకు దిగింది. ఈ క్రమంలో ఈ నెల 22న బషీరాబాద్ ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఆదివారం సాయంత్రం కూడా ఇదే విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి మొగులప్ప తన తల్లి ఎల్లమ్మ, కొడుకుతో కలిసి ఓ గదిలో నిద్రపోయారు. రేణుక, కూతురు పక్క గదిలో పడుకున్నారు. మంగళవారం ఉదయం లేచి చూసే సరికి ఎల్లమ్మ, మొగులప్ప దూలాలకు ఉరేసుకుని విగత జీవులుగా కనిపించారు. సమాచారం అందుకున్న బషీరాబాద్ ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ నారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

శరీరంపై గాయాలు

మొగులప్ప మృతిపై అతడి సోదరి నర్సమ్మ, గ్రామస్తులు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ఆత్మహత్య అయితే ఆయన మర్మాంగాల వద్ద రక్త స్రావం ఎందుకు అవుతుందని, ఉరి వేసుకుంటే మోకాళ్లపై ఎలా కూర్చుంటాడని ప్రశ్నించారు. ఇద్దరినీ రేణుక హత్య చేయించిందని ఆమె ఆరోపించింది. ఈ క్రమంలో పోలీసులు, గ్రామస్తులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ట్రాక్టర్‌లో వేసిన శవాలను పోస్టుమార్టానికి తరలించకుండా స్థానికులు అడ్డుకున్నారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. తాండూరు రూరల్ సీఐ నగేష్ ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పడంతో బంధువులు, గ్రామస్తులు వెనక్కితగ్గారు. అనంతరం మృతదేహాలకు తాండూరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఇదిలా ఉండగా మృతుడి భార్యకు వివాహేతర సంబంధం ఉందని, ఈ నేపథ్యంలోనే తన సోదరుడు, తల్లిని అడ్డు తొలగించుకునేందుకు పథకం వేసిందని అనుమానిస్తూ మొగులప్ప సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఎల్లమ్మ (ఫైల్)



మొగులప్ప (ఫైల్)

కాన్పుల సంఖ్యను పెంచండి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



రికార్డును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కేశంపేట: ప్రభుత్వ ఆసుపత్రిలో కా న్పుల సంఖ్యను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ(షాద్‌నగర్) విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులతో పాటు, ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ఓపీని 68 నుంచి 100కు పెంచాలని, రక్త నమూనాలను 19 నుంచి 30 వరకు పెంచాలని ఆదేశించారు. పరీక్షలకు కొండాపూర్‌లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. బీపీ, షుగర్ రోగులకు నెల రోజులకు సరిపడా మందులను అందించాలన్నారు. అనంతరం మండల పరిధిలో పాటిగడ్డ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈఓలు నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కేజీబీవీ ఎస్‌ఓ గౌసియా బేగం, ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.